# చింతామణి

- కాళ్ళకూరి నారాయణరావు

## ఎపిసోడ్ - 1

బిల్వమంగళుడి శయ్యా గృహం. బిల్వమంగళుడు ఆతని భార్య రాధ ఉంటారు. రాధ మహాభారతంలోని తిక్కన పద్యాలను బిల్వమంగళునకు చదివి వినిపిస్తుంటుంది. ఇద్దరి మధ్యా భార్యాభర్తల అనుబంధాలను గూర్చిన ప్రసక్తి వస్తుంది. లోకంలో భార్యను గౌరవించని భర్తలున్నారనీ అలాగే భార్యగా తమ విధులను సక్రమంగా నిర్వహించని భార్యలూ ఉన్నారని అంటాడు బిల్వ మంగళుడు. రోజూలాగే రాధ చదివే భారతాన్ని వినడానికి వచ్చే బిల్వమంగళుడి స్నేహితుడు దామోదరుడు కూడా వచ్చి చర్చలో పాల్గొంటాడు. ఇంతలో లోపలినుండి బిల్వమంగళుడి తండ్రి పిలుస్తాడు. లోపలికి వెళ్ళి వచ్చిన బిల్వమంగళుడు, భార్య, దామోదరులతో తండ్రి ఆరోజు నుండి వర్తక వ్యాపారాలకు సంబంధించిన బరువు బాధ్యత లన్నిటిని తనకు అప్పగించి విశ్రాంతి తీసుకోవాలని అనుకుంటున్నాడనీ తాను అందుకు సిద్ధ పడాలనీ అంటాడు. ముదుసలి వయసులో తల్లిదండ్రులు బరువు బాధ్యతలను పంచుకోవడం కొడుకుల కర్తవ్యమని అయితే అది తమ పద్యపఠనానికి ఆటంకం కాదనీ అంటాడు.

## ఎపిసోడ్ - 2

రెండవ రంగం వేశ్యల జీవితాలను విశదపరుస్తుంది. చింతామణి తల్లి శ్రీహరికి చింతామణికి మధ్య వాదోపవాదాలు జరుగుతాయి.

చింతామణి భవానీ శంకరునిమీద చూపుతున్న ప్రేమకు శ్రీహరి చిరాకు పడుతుంది. బికారిగా మారిన అతన్ని దూరం చేసుకోమని అంటుంది. తన ఆస్థంతా మనకు ధారపోసిన అతన్ని హటాత్తుగా వీధిన ఎలా పడేయడమని వాదిస్తుంది చింతామణి. శ్రీహరి చింతామణికి వేశ్యావృత్తికి చెందిన నీతులు చెబుతుంది. సానుభూతి వేశ్యలు వదిలేయాల్సిన మొదటి లక్షణమని బోధిస్తుంది. చింతామణి అది ఎలా సాధ్యమని నీవు వయసులో ఉండగా ఏం చేసావని ప్రశ్నిస్తుంది. శ్రీహరి తాను వయసులో ఉండగా తన వద్దకు వచ్చే వారినుండి డబ్బు ఎలా ముక్కు పిండి వసూలు చేసేదో, ఆ తరువాత వారిని ఎలా వదిలించుకునేదో సవివరంగా చెబుతుంది.

ఇంతలో చింతామణి చెల్లెలు చిత్ర వచ్చి నగరంలోని ధనిక వ్యాపారుల్లో ఒకడైన సుబ్బిశెట్టి వచ్చాడని చెబుతుంది. తన కూతురు దగ్గరకు ధనికుడైన కొత్త విటుడు వచ్చాడని విన్న శ్రీహరి ఆనంద పడుతుంది.

శ్రీహరి వెళ్ళి సుబ్బిశెట్టిని తోడుకొని తీసుకుని వస్తుంది. శ్రీహరి సుబ్బిశెట్టితో తన కూతురు చింతామణి కొన్ని నెలలుగా సుబ్బిశెట్టి కోసం తపించిపోతూ ఉన్నదని కానీ సుబ్బిశెట్టి మాత్రం అందం, చందం, ఒంపు, సొంపు లేని వేరే వేశ్యల కోసం వెడుతున్నాడని అంటుంది. ఇంగితం లేని సుబ్బిశెట్టి శ్రీహరి మాటలకు వెకిలి నవ్వులు నవ్వుతాడు.

చింతామణి కూడా సుబ్బిశెట్టి తప్పు చేసాడని అంటూ ఆతనితో సరసాలాడుతూ అతన్ని ఆకర్షిస్తుంది. మొదటిసారి కలవగానే చింతామణి లాఘవంగా సుబ్బిశెట్టిని మురిపించి ఆతని వజ్రపుటుంగరాన్ని తీసుకుంటుంది. లబలబలాడుతూనే ఇస్తాడు పిసినారి శెట్టి. ఎవరో వస్తున్న అలికిడి కావడంతో దొడ్డి దారిన శెట్టిని పంపించి వేస్తుంది శ్రీహరి.

## ఎపిసోడ్ - 3

చింతామణి చిరకాల ప్రేమికుడు భవానీ శంకరుడు వస్తాడు. తన సర్వస్వాన్నీ చింతామణి పరం చేసి ప్రస్తుతం ఎవరైనా అప్పు ఇస్తారేమోనని వెదుకుతుంటాడు. వీధి గుమ్మంనుండి వస్తే శ్రీహరికి దొరికి పోతాననే భయంతో వెనుక గుమ్మం నుండి వస్తాడు. చింతామణి పొద్దున్నే అలంకరించుకుని ఉన్న కారణం ప్రశ్నిస్తాడు. కోపంగా కొత్త ప్రేమికుని కోసమని అంటుంది చింతామణి. భవానీ శంకరుడు క్షమాపణ కోరుతాడు. చింతామణి వేశ్యలు ఎంత మంచివాళ్ళైనా మగవాళ్ళు వాళ్ళను అనుమానిస్తూనే ఉంటారని అంటుంది. అయితే పొద్దున్నే సుబ్బిశెట్టికి ఇక్కడేం పనని అడుగుతాడు. ఆమె మళ్ళీ చివాట్లు పెడుతుంది. అయితే భవానీ శంకరుడు తాను సుబ్బిశెట్టిని వచ్చిన కారణం అడిగానని చెబుతాడు. ఇంతలో భవానీ శంకరుని పాత స్నేహితుడు వచ్చాడని తెలుస్తుంది. చింతామణి భవానీ శంకరుని కనీసం ఈ రోజైనా డబ్బు తెచ్చావా అని అడుగుతుంది. డబ్బు లేకపోతే తన తల్లి తిట్లు పడలేనని అంటుంది. భవానీ శంకరుడు తాను తన స్నేహితులను, తాను ఎరిగి ఉన్న వారందరినీ అడిగి చూసాననీ ఎవ్వరూ కానీకూడా రాల్చలేదనీ వాపోతాడు. అంత కాలం తాను చింతామణికి ధారపోసిన ఆస్థుల గూర్చి ఏకరువు పెడతాడు. తానూ అతనికి ఇంతకాలం చేసిన సేవలగూర్చి, తాను అతని పట్ల ఎలా ఉదారంగా వ్యవహరించిందీ చెబుతుంది చింతామణి. అంగీకరిస్తాడు భవానీ. తన బాధలను ప్రస్తుతం వచ్చిన స్నేహితుడు తీరుస్తాడని ఆశా భావం వ్యక్తపరుస్తాడు.

ఇప్పుడు వచ్చిన స్నేహితుని గుణగణాలను గూర్చి, అతని ఆస్థిపాస్తులను గూర్చి, ఆతని మాన మర్యాదలనుగూర్చి, ఆతని వంశ ప్రతిష్టలను గూర్చి అభివర్ణిస్తాడు. ఆతడు తన దగ్గరికి ఎప్పుడైనా వచ్చాడా అని అడుగుతుంది చింతామణి. స్నేహితుడు బిల్వమంగళుడు ఉన్నతుడనీ వేశ్యా వాటికలకు రాడనీ అంటాడు భవానీ. పాండిత్యానికి సంబంధించి కొన్ని సందేహాలు తీర్చుకోవాలనీ అందుకోసం ఒకసారి బిల్వమంగళుడిని తన వద్దకు తీసుకుని రమ్మనీ అంటుంది చింతామణి.

## ఎపిసోడ్ - 4

బిల్వ మంగళుడు తన కార్యాలయంలో ఉంటాడు. భవానీ శంకరుడు ఆతన్ని చూడటానికి వస్తాడు. ఇంకా చింతామణి తనను ప్రేమిస్తుందని బిల్వమంగళుని ఆమెకు చూపి తద్వారా ఆమె మెప్పును పొందాలనీ అనుకుంటుడు భవానీ.

చింతామణి ఇచ్చిన సమస్యకు సమాధానం కోసం బిల్వమంగళుని అడుగుతాడు భవానీ. చిటికిలో దాన్ని విశద పరుస్తాడు బిల్వమంగళుడు. భవానీ ఆనందంతో పరుగున చింతామణి వద్దకు వెడతాడు.

వెంటనే మళ్ళీ వచ్చి చింతామణికి ఇంకా కొన్ని సందేహాలు ఉన్నాయనీ అవి తీర్చుకోవడానికి ఆమే స్వయంగా అతని వద్దకు వచ్చిందనీ చెబుతాడు. తికమకపడిన బిల్వమంగళుడు ఇష్టంలేక పోయినా ఆమెను తీసుకుని రమ్మని చెబుతాడు.

## ఎపిసోడ్ - 5

అది వరకే బిల్వమంగళుని చూసిన చింతామణి అతన్ని మోహిస్తుంది. బిల్వమంగళుడు కూడా ఆమె అందానికి అబ్బుర పడతాడు. ఆమె అతన్ని రకరకాల ప్రశ్నలు వేస్తుంది. బిల్వమంగళుడు తడబడకుండా వాటికి సమాధానాలు ఇస్తాడు. అబ్బుర పడిన చింతామణి ఆరాధనగా తన మెడలోని వజ్రాల హారాన్ని ఆతని మెడలో వేస్తుంది. బిల్వమంగళుడు ఉలిక్కిపడుతాడు.

ఆమె తన ప్రశ్నకు సమాధానమిస్తే ఆమెకూ తాను బహుమతినిస్తానని అంటాడు బిల్వమంగళుడు. ప్రశ్న ఉడుగబోతుండగా తండ్రి పిలిచిన అలికిడి వినబడటంతో కంకారుగా వారిని వెనుక ద్వారం నుండి బయటకు పంపుతాడు. వారి ఓర చూపులు చింతామణి అత్యుత్సాహము, ప్రవర్తన భవానీ శంకరునికి అనుమానం కలుగ జేస్తాయి.

## ఎపిసోడ్ - 6

మరునాడు భవానీ బిల్వమంగళుని వద్దకు వస్తాడు. ముందు రోజు సాయంత్రం అనుభవాన్ని గూర్చి ప్రశ్నిస్తాడు. బిల్వమంగళుడు ఆమె అందాన్ని పొగడుతాడు. అట్లయితే తాను అతన్ని ఆమె వద్దకు తీసుకుని పోతానని అంటాడు భవానీ శంకరం. ఎవరైనా చూస్తారని భయపడతాడు బిల్వమంగళుడు. అలా అయితే అతన్ని రాత్రిపూట తీసుకుని పోతానని ఎవరూ చూసే అవకాశం ఉండదనీ చెబుతాడు భవానీ. ఇతని రాకను గూర్చి చింతామణికి చెబుతానని అంటాడు. ఆనందంగా అంగీకరిస్తాడు బిల్వమంగళుడు.

## ఎపిసోడ్ - 7

చింతామణి తన ఇంట్లో ఆత్రుతగా బిల్వమంగళుని రాకకోసం వేచి ఉంటుంది. ఇంతలో సుబ్బిశెట్టి వస్తాడు. శ్రీహరి చింతామణులు చికాకు పడతారు. ఇద్దరు స్నేహితులు రాగానే సుబ్బిశెట్టిని బలవంతంగా పంపేస్తారు.

బిల్వమంగళుడు చింతామణికి సమస్యను ఇస్తాడు. ఆమె దాన్ని పూరిస్తుంది. దానితో బిల్వ మంగళుడు ఆమెకు ఒక భరిణ ఇస్తాడు. ఆమె దాన్ని తెరచి చూడగా అందులో వజ్రపు వుంగరం ఉంటుంది.

చింతామణి ధైర్యంగా బిల్వమంగళుడి సమీపంలోనికి వచ్చి తన కోరిక తీరుస్తానని ప్రమాణం చేయమని అడుగుతుంది.ఏమిటని అడుగుతాడు బిల్వమంగళుడు. అంతటి మేధావి వద్ద కామసూత్రాలు నేర్చుకోవాలని ఉందని చెబుతుంది.

ఈ పరిణామాన్ని చూచిన భవానీ శంకరుడు దిగాలు పడతాడు.

## ఎపిసోడ్ - 8

బిల్వమంగళుడు చింతామణి వ్యామోహంలో పడటం గమనించిన భవానీ వైరాగ్యంతో ప్రజలకు నీతిమాలిన ఇటువంటి స్త్రీల చిరునవ్వులకు మోసపోవద్దని నీతులు చెబుతాడు. అదే వీధిలో ఆతనికి సుబ్బి శెట్టి ఎదురు పడతాడు. ఇద్దరూ తమ అనుభవాలను పంచుకుంటారు. భవానీ అసలు శత్రువు చింతామణి తల్లి శ్రీహరేనని అంటాడు. సుబ్బిశెట్టి అంగీకరించడు. చింతామణి కోసం బిల్వ మంగళుడు ఏడంతస్తులమేడ నిర్మిస్తున్నాడని చెబుతాడు సుబ్బిశెట్టి.

బిల్వమంగళుడు చింతామణి మాట్లాడు కుంటుండగా చిత్ర ప్రవేశించి శ్రీహరి సుబ్బి శెట్టిని రక్షక భటులకు  అప్పగించిందని చెబుతుంది. చింతామణి బిల్వమంగళునితో ఎలాగైనా అతని పరపతిని ఉపయోగించి సుబ్బిశెట్టిని విడిపించమని అడుగుతుంది. అంగీకరిస్తాడు బిల్వమంగళుడు.

## ఎపిసోడ్ - 9

రాధ తన దురదృష్టానికి తన్ను తాను నిందించుకుంటుంది. తన భర్త తనపట్ల వ్యాపార బాధ్యతల పట్ల నిర్లక్ష్యం వహించడాన్ని చూసి బాధపడుతుంది. బిల్వమంగళుడు కోపంగా వస్తాడు. ఏమైందని అడుగుతుంది రాధ. చింతామణికి భరించలేనంత తలనొప్పి వచ్చిందని దానికి కారణం రాధకు ఆమె పట్ల ఉన్న దుః శ్చింతేనని అంటాడు. భోజనం చేస్తున్నప్పుడు ఆమెను అక్కడ నుండి వెళ్ళిపొమ్మని అనడంతో మరింత బాధ పడుతుంది రాధ.

రాధ బాధతో కృంగి పోయి తన భర్తను ఎందుకిలా మారిపోయారని ప్రశ్నిస్తుంది. తన ధ్యాసంతా చింతామణిపైనే నని జవాబిస్తాడు బిల్వమంగళుడు. తను చేసిన తప్పేమిటని నిలదీస్తుంది. తన భార్య కావటమేనని జవాబిస్తాడు. రాధ తన విధిని తాను నిందిచుకుంటుంది. చింతామణి తనను తన అంద చందాలతో ఆకర్షించిందని అంటాడు బిల్వమంగళుడు. తాను ఇందులోనుండి ఎప్పుడు, ఎలా బయటపడతానో చెప్పలేనని అంటాడు. మళ్ళీ బయలు దేరి వెళ్ళబోతుండగా ఆతని స్నేహితుడు దామోదరుడు వస్తాడు. బిల్వమంగళునితో మాట్లాడటానికి అతన్ని అనుసరిస్తాడు.

## ఎపిసోడ్ - 10

దామోదరుడు బిల్వమంగళుని తప్పు దారిలో వెడుతున్నావని హెచ్చరిస్తాడు. తనకూ ఆ విషయం అర్థమైందని అంటాడు బిల్వమంగళుడు. బిల్వమంగళుని భార్య రాధ మంచితనం గూర్చి చెప్పి అలాంటి భార్యను బాధపెట్టవద్దని సలహా ఇస్తాడు దామోదరుడు. వేశ్యలంతా ఎప్పటికైనా విటులను ముంచుతారని అంటాడు. అయితే చింతామణి అలాంటి వాటికి అతీతురాలని ఆమె తనను మనస్ఫూర్తిగా ఆరాధిస్తుందని అంటాడు బిల్వమంగళుడు. దామోదరుడు నవ్వుతాడు. బిల్వ మంగళుడు అతను చెప్పిన ప్రతీ విషయం చింతామణికి వ్యతిరేకంగా ఎలా లేదో చూపిస్తాడు.

దామోదరుని స్నేహితులంతా అతన్ని ఈ విషయం నుండి బయటకు తీసుకురావడానికి ప్రయత్నిస్తారు. ఎందుకంటే అతను మరీ ఎక్కువగా ఈ విషయంలో తల దూర్చి బయటకు తీసుకుని వచ్చే క్రమంలో చింతామణి వల్ల ఆకర్షింపబడుతాడని అంటారు. దానికి దామోదరుడు బాధపడి అసలు వేశ్యావృత్తినే అసహ్యించుకుంటాడు.

## ఎపిసోడ్ - 11

బిల్వమంగళుని తండ్రి వాసుదేవమూర్తి జబ్బు పడతాడు. తన కొడుకును చూడాలని కలవరిస్తుంటాడు. ఎన్నోసార్లు కబురు పంపగా పంపగా వచ్చిన బిల్వమంగళుడు అనవసరంగా కంగారు పెట్టారని తిడతాడు. రాధ అతని తండ్రికి బాగా లేదని ఈ రోజు గడుస్తుందో లేదో తెలియదని అంటుంది.

తండ్రి లేచి కుమారుడి మాటలు విని సాధ్వి అయిన రాధను అలా అన్నందుకు కొడుకును చివాట్లు పెడతాడు. ఇంత గుడ్డిగా ప్రవర్తిస్తున్నందుకు తిడతాడు. అసలు వీటన్నిటికీ మూలకారణం చింతామణేనని ఆమెను దుమ్మెత్తిపోస్తాడు. బిల్వ మంగళుడు తండ్రి పట్ల ఆగ్రహించి వెళ్ళిపోతాడు. తండ్రి అలాంటి స్థితిలో ఉండగా తనను ఒంటరిగా వదిలి వెళ్ళవద్దని బ్రతిమాలుతుంది రాధ.

వాసుదేవమూర్తి రోదిస్తూ నేల కొరుగుతాడు. బిల్వమంగళుడు తండ్రి చనిపోవడం చూసి ఒక్క క్షణం బాధపడతాడు. ఇంతలో ఉరుము వినబడుతుంది. బిల్వమంగళుడు బయలు దేరబోతాడు. చింతామణికి

ఉరుములు మెరుపులు పిడుగులంటే భయమని తాను తోడు ఉండాలని అంటాడు. రాధ అతన్ని వెళ్ళవద్దని బ్రతిమాలుతుంది. వినకుండా మరునాడు ఉదయం వస్తానని వెళ్ళిపోతాడు బిల్వమంగళుడు.

రాధ కృంగిపోతుంది. పిచ్చి దానిలా మారిపోతుంది. పచ్చని సంసారాల్లో చిచ్చు పెడుతున్న వేశ్యలను వారి వృత్తిని తిట్టి పోస్తుంది. తన మామగారు తననూ ఆ లోకం నుండి వచ్చేయమని పిలిచినట్లు భావించి తానూ ఈ లోకం నుండి నిష్క్రమిస్తానని అంటుంది. అయితే చివరిసారి భర్త పాదాలు తాకి అతని దగ్గర సెలవు తీసుకుని వస్తానని అంటుంది. నేలపై పడిపోతుంది.

## ఎపిసోడ్ - 12

చింతామణి కృష్ణుని ప్రార్థిస్తూ ఉంటుంది. కృష్ణుడు తనను రమ్మని పిలిచినట్లుగా అనిపిస్తుంది. కృష్ణునితో తనను ఇంత సిగ్గుమాలిన జీవిగా పుట్టించినది ఎందుకని అంటుంది. కృష్ణుని తనతో తీసుకుని పొమ్మని మైకంలో మునిగి పోతుంది. శ్రీకృష్ణుడు ప్రత్యక్షమౌతాడు. సకల చరాచర జీవకోటిని తానే వారివారి కర్మ ఫలాన్ని బట్టి శాసిస్తాననీ మానవుడు తాను కోరింది లభించినంత కాలం దేవుని స్మరించడనీ కనీసం పక్కవాడి గూర్చి గూడా ఆలోచించనంత స్వార్థ పరుడనీ అయినా తాను భక్తుల చిన్న చిన్న తప్పులను మన్నిస్తాననీ అంటాడు శ్రీకృష్ణుడు.

చింతామణి ఎన్ని పాపకార్యాలు చేసినా తోటివారి గూర్చి ఆలోచించిందనీ పాపచింతన దైవభక్తితో తాను చేసే తప్పులకు బాధ పడిందనీ అంటాడు. ఆమె తప్పులను తెలుసుకుని దిద్దుకోవాలని అలాగే ఆమెద్వారా బిల్వమంగళుడు కూడా తన విధి తెలుసుకోవాలని అంటాడు.

చింతామణి లేచి చుట్టూ చూసుకుని చిత్రను శ్రీకృష్ణుడేడని అడుగుతుంది. చిత్ర కంగారు పడుతుంది. శ్రీకృష్ణుడు తనను ఈ పాపజీవితం నుండి బయటకు రమ్మనీ నాటి నుండి తన దగ్గరకు వచ్చేవారి జీవితాలు నాశనం చేయవద్దని శ్రీకృష్ణుడు తనను ఆదేశించాడని అంటుంది.

## ఎపిసోడ్ - 13

చింతామణి ఈ మైకం నుండి తేరుకుంటుండగా తలుపు తట్టిన శబ్దం వినబడుతుంది. చిత్ర తలుపు తీస్తుంది. తడిసిముద్దయిన బిల్వమంగళుడు నిలబడి ఉంటాడు. జబ్బు పడ్డ తండ్రిని వదిలి ఇంతవర్షంలో అర్థరాత్రి వచ్చిన బిల్వమంగళుని చూసిన చింతామణి ఆశ్చర్యపోతుంది. తన తండ్రి ఈ లోకాన్ని వదిలి వెళ్ళాడని చెబుతాడు బిల్వమంగళుడు. ఆమె బాధ పడుతుంది. శరీరంపై అక్కడక్కడ రక్తం మరకలు చూసిన చింతామణి బిల్వ మంగళుడిని ఏమైందని అడుగుతుంది. ముఖద్వారం గడియలోపలి నుండి పెట్టి ఉండగా అతను లోపలికి ఎలా వచ్చాడని అడుగుతుంది. తాను తాడు సహాయంతో వెనుక గోడ దూకి వచ్చానని

చెబుతాడు. తీరా అక్కడికి వెళ్లి చూడగా పాము ఒకటి చచ్చిపడి ఉంటుంది. బిల్వమంగళుడు తాడు అనుకుని పామును ఉపయోగించి గోడ దూకాడని గ్రహిస్తారు. నదిని ఎలా దాటావని ప్రశ్నిస్తుంది చింతామణి. కర్రలాంటిదేదో దొరికిందని దాని సహాయంతో నది దాటానని అంటాడు బిల్వమంగళుడు. తీరా అక్కడికి వెళ్ళి చూస్తే అది కర్ర కాక మెత్తగా ఉంటుంది. పరిశీలించి చూడగా అది రాధ శవమని తెలుతుంది. చింతామణి రాధను బ్రతుకుండగానే కాక చనిపోయి శవమైకూడా భర్తకు సేవచేసి అతని ప్రాణాలను రక్షించిన పతివ్రత అని కొనియాడుతుంది.

బిల్వమంగళుడు చింతామణిపై ప్రేమే తనను ఈ విధంగా చేసిందని అంటాడు. చింతామణి బిల్వమంగళుడు తన నిజరూపం చూడలేదని గ్రహిస్తుంది. నెమ్మది నెమ్మదిగా ఒక్కో ఆభరణము అలంకారమూ తీసివేస్తుంది. ఆమె తన జీవితకాలంలో ఎంతోమంది మగవాళ్ళను చూసానని చెబుతుంది. బిల్వమంగళుని కళ్ళు తెరుచుకుంటాయి. ఇద్దరూ వేశ్యల వల్ల సమాజానికి జరిగే చెడుకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని ప్రతిన చేస్తారు.

చింతామణి తన పూర్వ విటు లందరినీ పిలిచి వారు తన దగ్గర పోగొట్టుకున్న ధనాన్నంతా తిరిగి ఇస్తుంది. మిగిలిన ధనంతో శేషజీవితాన్ని కృష్ణ సేవలో గడుపుతుంది.